క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి విరాళం

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అభివృద్ధికి గురడి కాపు సంఘం సభ్యులు రూ.లక్ష విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ మేరకు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గడ్డం రాజారెడ్డికి చెక్కును గురడి కాపు సంఘం ప్రతినిధులు అందజేశారు. ఉపసర్పంచ్ జక్కం బాల్‌కిషన్, ఎంపీటీసీ గడ్డం గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, పాల్గొన్నారు.

ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల వితరణ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఎల్లమ్మకుంట, అమ్రాబాద్ జీపీల్లో రెడ్‌కో సంస్థ నుంచి 6 చొప్పున ఫ్యాన్లు, 10 చొప్పున ట్యూబ్ లైట్లను జిల్లా మేనేజర్ గంగాధర్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింగం నాయక్, సర్పంచులు, నాయకులు గోకుల్‌సింగ్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

కబ్జా చేసిన పార్క్ స్థలం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



నిజామాబాద్‌నాగారం: నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీ గీతాంజలి స్కూల్ వెనుక భాగంలో పార్కు స్థలం రిటైర్డ్ టీపీవో కబ్జా చేసిన విషయమై పరిశీలన చేయడానికి హైద్రాబాద్ నుంచి ఆర్‌డీ నర్సింహారెడ్డి జిల్లాకు వచ్చారు. శుక్రవారం ప్రత్యేకంగా టీపీవో కరుణాకర్, టీపీఎస్ అనుపమతో కలిసి వెళ్లి కబ్జా చేసిన పార్కు స్థలాన్ని పరిశీలించారు. అలాగే మాణిక్‌బండార్‌లో పార్కు స్థలాన్ని ఏకంగా వెంచర్ యజమాని అమ్మేయడంపై సాక్షిలో కథనాలు వచ్చాయి. ఈ స్థలం వద్దకు వెళ్లి ఆర్‌డీ నర్సింహారెడ్డి పరిశీలించారు.

న్యాక్ భవనం..

జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ ప్రాంతంలో నిర్మిస్తున్న న్యాక్ భవనాన్ని న్యాక్ డైరెక్టర్ సత్యపాల్ శుక్రవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్, ట్రైనర్ ప్రదీప్ పాల్గొన్నారు.

గిరి వికాస పథకం భూములు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఎల్లమ్మకుంటలో గిరి వికాస పథకం కింద ప్రతిపాదించిన భూములను ఎంపీడీవో లింగం నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఎల్లమ్మకుంట నుంచి ముగ్గురు రైతుల పేర్లను గిరి వికాస పథకానికి ప్రతిపాదించామని తెలిపారు. పడావుగా ఉన్న భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు డీఆర్‌డీవో నుంచి బోరుబావులను మంజూరు చేయడం పథకం ఉద్దేశమన్నారు.

సీఏ పరీక్షల్లో విద్యార్థి ప్రతిభ

డిచ్‌పల్లి: యానంపల్లి గ్రామానికి చెందిన దాసరి వంశీ, సీఏ తుది పరీక్షలో 472 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించినట్లు జెడ్పీటీసీ దాసరి ఇందిర శుక్రవారం తెలిపారు. ఇండియాలో సుమారు లక్ష మంది విద్యార్థులు సీఏ పరీక్షలు రాయగా కేవలం 13 వేల మంది మాత్రమే ఉత్తీర్ణులైనట్లు జెడ్పీటీసీ తెలిపారు. దీంతో వంశీని జెడ్పీటీసీ ఇందిర అభినందించారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ఖలీల్‌వాడి: డ్రైవర్లు వాహనాలను నడిపించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో డ్రైవర్‌లకు టాక్ట్ ఆధ్వర్యంలో చోళ ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ శిక్షణ కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్‌లు మాట్లాడొద్దని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని తెలిపారు. చోళ ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ సెంథిల్‌కుమార్, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శంకర్, డిపోమేనేజర్ ఆనంద్ ఉన్నారు.

నియామకం

ఖలీల్‌వాడి: జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఈరంటి లింగంను నియమించారు.ఈ మేరకు నియామక పత్రాన్ని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీలకు చేసిన అభివృద్ధి పనులను వివరించాలన్నారు. డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ రూరల్ ఇన్‌ఛార్జ్ భూపతిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతంకుమార్, జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. నాయకులు ప్రిన్స్, మనోజ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు ..

సిరికొండ: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు లక్ష్మీ, గోవర్ధన్‌లు డిమాండ్ చేశారు. మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. కార్యాలయ సిబ్బందికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 10 నుండి 12 వరకు సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఖాళీస్థలాలపై పట్టింపేదీ?

- మురికినీళ్లు నిండిపోయి దుర్వాసన
- స్థానికుల అవస్థలు
- పట్టించుకోని బల్దియా అధికారులు

నిజామాబాద్ సిటీ : నగరంలోని న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో ఖాళీ స్థలాలపై బల్దియా శ్రద్ధ పెట్టకపోవడంతో ఆ స్థలాల కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న పిచ్చిమొక్కలు, చెత్తతో దుర్వాసన వస్తోందని, చిన్నారులకు రోగాలు వస్తున్నాయని పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డులో కొందరు ప్లాట్లు కొనుగోలు చేసి అందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టక అలాగే వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. అసలే వర్షాకాలం కావటంతో మొక్కలు తొందరగా పెరిగి దట్టంగా మారి పాములు, విషపు పురుగులకు అవాసనంగా మారుతున్నాయి. దీంతో రాత్రివేళల్లో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో పాములు ఇళ్లలోకి రావడంతో మహిళలు చిన్నారులు భయపడుతున్నారు.

నోటీసులివ్వని అధికారులు..

మున్సిపల్ నిబంధనల ప్రకారం జనావాసాల మధ్య ఖాళీస్థలాలు ఉన్నవారు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాని ఎవరూ తమ ప్లాట్లను శుభ్రంగా ఉంచుకోకపోవటంతో వారికి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ నుంచి నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అధికారులు స్థలాలు కొన్నవారిని గుర్తించి నోటీసులు జారీ చేయటంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో ఖాళీప్లాట్లలో వేసిన చెత్తాచెదారం

అధికారుల నిర్లక్ష్యం సరైంది కాదు



హౌసింగ్‌బోర్డు కాలనీలో చాలాచోట్ల ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటిలో దట్టంగా పనికిరాని చెట్లు పెరగటంతో పాములు, విషపురుగులు ఉంటున్నాయి. కాలనీలో చిన్నపిల్లలు ఆడుకోవటానికి బయటకు వస్తే పాములు తదితర ఇతర ప్రాణులతో అపాయం జరిగితే ఎవరిది బాధ్యత. అధికారులు ఈ సమస్యలను గుర్తించి తక్షణమే ఖాళీ స్థలాలు ఎవరివో గుర్తించి వారితో ప్లాట్లు శుభ్రం చేయించే బాధ్యతలు తీసుకోవాలి.

– వినోద్‌కుమార్, రిటైర్డు ఉద్యోగి న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ

యూజీడీ లేక ఇబ్బందులు



న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో ఇప్పటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. మురుగు నీరు బయటకు పారేలా సరియైన డ్రైనేజీలు లేవు. ఇంటర్నల్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఖచ్చా డ్రైనేజీలలో చెట్లు పెరుగుతున్నాయి. కాలనీలో పట్టణ ప్రకృతి కేంద్రం పార్కులో చీకటిగా ఉంటుంది. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

– దేవిసింగ్ పోలీస్‌శాఖ. న్యూహౌసింగ్‌బోర్డు కాలనీ

సమాజ సేవలో వెలమలు ముందుండాలి

- జెడ్పీ చెర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఉన్న వెలమ కులస్తులు సమాజ సేవలో ముందుండాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వెలమ కల్యాణ మండపంలో జిల్లా వెలమ సంఘం సర్వ సభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నూతన కమిటీ సభ్యులు అందరు కుర్చీ కోసం కాకుండా అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. వచ్చే 6 నెలల్లో ఫంక్షన్‌హాల్ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కిషోర్‌రావు, ప్రధాన కార్యదర్శి దయాకర్‌రావు, దాత ప్రేమ్‌సాగర్, మాజీ అధ్యక్షులు రాంకిషన్‌రావు, కోశాధికారి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్ రావు

గృహలక్ష్మి పథకం మాటలకే పరిమితం

- బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: గృహలక్ష్మి పథకం కేవలం మాటలకే పరిమితమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. శుక్రవారం నగరంలోని 16వ డివిజన్‌లో కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక ఆధ్వర్యంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 9 ఏళ్లలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. అనంతరం ధన్‌పాల్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం అమల్జేస్తున్న పథకాలను తామే ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఆవాస్ యోజన కింద ఇచ్చిన నిధులను డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ఇతర పథకాలకు మళ్లించారని, కానీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. గృహలక్ష్మీ పథకం కింద మొదట రూ.5లక్షలు, ఇప్పుడు రూ.3లక్షలు ఇస్తామని మాటలు మాత్రమే చెప్తున్నారని, పేదలపై ఎంతకంత వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. నాయకులు, కార్పొరేటర్లు గణేష్, రాంప్రసాద్, భీమన్న, రాజు, మల్లికార్జున్, గడ్డం రాజు, నాగోల్ల లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.



పథకాల గురించి వివరిస్తున్న ధన్‌పాల్

ఎస్సీ వర్గీకరణ ఉద్యమం తీవ్రం చేస్తాం



బోర్గాం చౌరస్తాలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు



నగరంలోని ఎల్లమ్మ గుట్టలో ..

మోపాల్/నిజామాబాద్‌నాగారం:అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలతో పాటు వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జెండాలను ఎగురవేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి బీజేపీ పతనానికి నాంది పలుకుతామని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి నాగభూషణంతో పాటు పలువురు నాయకులు హెచ్చరించారు. వర్గీకరణ సాధించేవరకు పోరాడుతామన్నారు.

ఓటర్ల నమోదులో అభ్యంతరాలుంటే చెప్పండి

- మున్సిపల్ కమిషనర్ చిత్రా మిశ్రా

నిజామాబాద్‌నాగారం: నగర పరిధిలో ఓటర్ల నమోదు ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ అవగాహన కల్పించారు. శుక్రవారం నూతన కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని ఓటర్ నమోదు, అభ్యంతరాలపై తెలపాలని నాయకులను కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరేందర్, నార్త్, సౌత్ తహసీల్దార్‌లు ప్రసాద్, సుదర్శన్, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ చిత్రా మిశ్రా

సమాచారం..

నేడు పోడు పట్టాల పంపిణీ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ తండాలో నేడు(శనివారం) ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పోడు భూముల పట్టాలను పంపిణీ చేయనున్నారు. గ్రామంలో గల జగదాంబ మాత సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

గ్రామదేవతలకు జలాభిషేకాలు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో శుక్రవారం గ్రామదేవతలకు గంగానీళ్లతో అభిషేకాలు జరిగాయి. గ్రామంలో గల 18 దేవతలకు గంగా నీటితో అభిషేకాలు చేశారు. వర్షాలు కురవాలని, పంటలు సంవృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ అభిషేకాలు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఉప సర్పంచ్ శంకర్ రెడ్డి, ఎంపీటీసీ అంకాల గంగాధర్ పాల్గొన్నారు.

సారంగపూర్‌లో ఘనంగా బోనాలు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం సారంగపూర్‌లో శుక్రవారం వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ జరిగింది. ఉదయం గ్రామస్తులు గంగనీళ్లు తీసుకువచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం గ్రామ మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



డిచ్‌పల్లి: స్వయం సహాయక సభ్యులు(ఎస్‌హెచ్‌జీ) న్యూ ఎంటర్‌ప్రైజెస్ కింద ఇస్తున్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని స్త్రీనిధి రీజనల్ మేనేజర్(ఆర్‌ఎం) రాందాస్ సూచించారు. శుక్రవారం డిచ్‌పల్లిలో నిర్వహించిన ఐకేపీ వీవోఏల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ (పీఎంఎఫ్‌ఎంఈ) పథకం కింద సభ్యులకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. స్త్రీనిధి మేనేజర్ రాఘవ, ఏపీఎం నాగరాజు, సీసీలు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వర్సిటీ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తెయూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయంతి మాట్లాడుతూ.. వర్సిటీకి మంజూరైన బాలికల హాస్టల్ నిర్మాణం త్వరగా ప్రారంభించాలన్నారు. బాలికల హాస్టల్‌కు మరొక కేర్‌టేకర్‌ను నియమించాలని, స్టడీ టేబుల్స్, కుర్చీలు, వైఫై సౌకర్యం కల్పించాలన్నారు. నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. నేతలు శివసాయి, అక్షయ్, రవీందర్ పాల్గొన్నారు.



తెయూ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

తెయూ బీసీ విద్యార్థి సంఘం కార్యవర్గం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా సంపత్, కార్యదర్శిగా యాదగిరి తదితరులు ఎన్నికయ్యారు.

మురుగునీటి శుద్ధి ప్రాజెక్టు ముందుకు సాగుతలేదు

ఖలీల్‌వాడి: భూగర్భ, మురుగునీరు శుద్ధి ప్రాజెక్టు ఏండ్లు గడుస్తున్నా అడుగు ముందుకు సాగడం లేదని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ మురుగునీటి శుద్ధి ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. రూ.246 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో కమీషన్లు తీసుకోవడంతో ఇది ముందుకు వెళ్లడం లేదన్నారు. నగరంలో నాలుగేళ్ల క్రితం మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ ఇప్పటి వరకు అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్‌హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశవవేణు, కాంగ్రెస్ నేతలు విక్కీ యాదవ్, వేణు రాజ్, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

అధికారమిస్తే ఏకకాలంలో రుణాలు మాఫీ

జక్రాన్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణాలను మాఫీ చేస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పాటు మనోహరాబాద్, తొర్లికొండ, కొలిప్యాక్, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున గడప గడపకు కాంగ్రెస్ నినాదంతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మోపాల్ మండల అధ్యక్షుడు రవి, ఎంపీటీసీ నర్సారెడ్డి, సొసైటీ చైర్మన్ తెల్లన్న, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నగేష్‌రెడ్డి

సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్‌అర్బన్: జాతీయ స్థాయిలో జరిగిన సైన్స్ ఒలంపియాడ్ పోటీల్లో ఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల జోనల్ ఇన్‌చార్జి ప్రణీత్ తెలిపారు. విద్యార్థులు మహతి, సాత్విక జోనల్ లెవల్లో ఎక్సలెంట్ సర్టిఫికెట్‌తో పాటు రూ.2,500 నగదు ప్రోత్సాహం పొందినట్లు ఆయన తెలిపారు. అశ్విత, నబిహ మ హావీర్‌లు ఎక్సలెంట్ ధ్రువపత్రంతోపాటు రూ. 1,250 నగదు, సాత్విక, వర్ష, రుషిలకు రూ.500 నగదు పొందినట్లు తెలిపారు. అనంతరం సన్మానించారు.



విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి

సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం ఎందుకు?

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం ఎందుకని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి ప్రశ్నించారు. శుక్రవారం కాలూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో వర్క్‌షాపు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య ఇస్తామన్న మాట ఆచరణలో పెట్టలేక పోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని వ్యాఖ్యానించారు. ప్రధాన కార్యదర్శి రఘురాం, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,600	వెండి (కిలో)	74,200
22 క్యారెట్స్	55,870	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	100	130	గాజరుగడ్డ	30	60
బెండకాయ	35	70	పచ్చిమిర్చి	90	130
బీరకాయ	35	70	దోసకాయ	20	40
దొండకాయ	35	70	ఆలుగడ్డ	17	30
బీర్నిసుకాయ	120	150	గోబిగడ్డ	15	30
కాకరకాయ	50	70	గోబిపువ్వు	40	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	70	చామగడ్డ	40	60
కొత్తిమీర	50	70	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	80	110
క్యాప్సికం	40	60			

– ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 రంగబలి(తెలుగు)- 1.30
సర్కిల్(తెలుగు)-4.30
ఎస్‌పీవై(తెలుగు)-7.30
ఓ సాతియ(తెలుగు)-10.20

స్క్రీన్-2 భాగ్‌సాలే(తెలుగు)-10.30,4.40 7.25,10.30
ఇన్‌సైడ్స్ ది రెడ్ డీ-1.25

స్క్రీన్-3 సామజవరగమన(తెలుగు) -10.35 , 1.20,4.30,7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 సామజవరగమన(తెలుగు)-12.10
రంగబలి(తెలుగు)-3.10, 9.50
ఆదిపురుష్(తెలుగు)3డీ- 6.05

స్క్రీన్-2 ఇన్‌సైడ్స్(తెలుగు)-11.20,7:11
పీఎం(తెలుగు)-1.50
ఇన్‌సైడ్స్(ఇంగ్లీష్)-4.55,10.05
భాగ్‌సాలే(తెలుగు)-7.25

స్క్రీన్-3 సర్కిల్(తెలుగు)-1.10
ఎస్‌పీవై(తెలుగు)-4.00
సామజవరగమన(తెలుగు)- 7.10
ఓ సాతియ(తెలుగు)-10.10

స్క్రీన్-4 భాగ్‌సాలే(తెలుగు)-1.05
లస్ట్(తెలుగు)-3.45
రుద్రాంగి(తెలుగు)-6.30
సత్యప్రేమ్‌కథ(హిందీ)-9.30

దేవి ఎస్‌పీవై(తెలుగు)-11.15 2.15
రుద్రంగి-6.15 9.15

నటరాజ్ భాగ్ సాలే

లలితామహల్ రంగబలి

విజయ్ ఆది పురుష్ (తెలుగు)

సంక్షిప్తం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సిరికొండ: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధితుడు మాద గంగాధర్‌కు రూ.18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ రాజారెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి, కారోబార్ పాల్గొన్నారు.

టీచర్ డిప్యుటేషన్ నిలిపేయండి

నిజామాబాద్‌అర్బన్: రెంజల్ ఉర్దూ పాఠశాలకు చెందిన నజీమ్ అనే టీచర్‌ను కందకుర్తికి డిప్యుటేషన్‌పై పంపడం వెంటనే ఆపేయాలని రెంజల్ మండల ఎంఐఎం నాయకులు శుక్రవారం డీఈవోకు విన్నవించారు. అసలే టీచర్ల కొరత ఉండగా కందకుర్తికి ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. వెంటనే డిప్యూటేషన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలన్నరు.

రేషన్ దుకాణం అప్పగింత

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్‌లో ఆరునెలల క్రితం సీజ్ అయిన రేషన్ దుకాణాన్ని మండల ఆర్ఐ హరీష్‌రెడ్డి శుక్రవారం తిరిగి రేషన్ డీలర్ కోర్వ గంగాధర్‌కు అప్పగించారు. ఆరు నెలల క్రితం రేషన్ బియ్యాన్ని రాత్రి సమయంలో డీలర్ వేరే చోటుకు తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. డీలర్‌పై విచారణ జరిపించి ఎలాంటి తప్పులేదని తేల్చి సీజ్ చేసిన దుకాణాన్ని తిరిగి అప్పగించారు.

'ఎన్ఎస్ఎఫ్‌ను తెరిపించలేని అసమర్థ సర్కార్'

ఖలీల్‌వాడి: ప్రభుత్వం ఏర్పడి 10 ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు నిజాంషుగర్ ఫ్యాక్టరీ(ఎన్ఎస్ఎఫ్)ని తెరిపించలేని అసమర్థ సర్కార్ బీఆర్ఎస్ ప్రభుత్వమని టీడీపీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నేతలు వినోద్, రాజన్న, ప్రవీణ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం

ఖలీల్‌వాడి: పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్షను నిలుపుదల చేయాలని కోరుతూ గుజరాత్ హైకోర్టులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వేసి పిటిషన్‌ను కొట్టివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ చౌరస్తా వద్ద నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు విపుల్ గౌడ్, అబూద్ బిన్ హందాన్, రత్నాకర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరికొండ/ధర్పల్లి/డిచ్‌పల్లి: జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు రమేశ్, ప్రజాప్రంథా నేత సాయారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ, ధర్పల్లి,డిచ్‌పల్లిలో కార్మికులు సమ్మె చేశారు.రెగ్యులర్ చేయాలని, వేతనాలను పెంచాలని కోరారు.

బీజేపీ సభను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్: వరంగల్‌లోని ఆర్ట్స్ –సైన్స్ కాలేజీ మైదానంలో శనివారం నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య శుక్రవారం తెలిపారు. ప్రధాని మోదీ ఈ సభకు హాజరుకానున్నారని , రూ.6,100 కోట్లతో అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను చేపట్టనున్నారని పేర్కొన్నారు.